ప్రజాశక్తి
సోమవారం 24 మార్చి 2025 5 అనంతపురం



నష్టపోయిన రైతులను ఆదుకోండి

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంట రైతులను ఆదుకోవాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి యాడికి మండలంలోని రాయలచెరువు, పచ్చర్ల మేకలపల్లి, పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరు, గార్లదిన్నె, ధర్మాపురం, వరదాయపల్లి, ముచ్చుకోట, కొట్టాలపల్లి, అమ్మవారి పల్లి, సోమనపల్లి, పసలూరు, చింతలపల్లి, చిక్కేపల్లి, తిమ్మనచెరువు, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి పంటలు నేలకు ఒరిగాయన్నారు. దీంతో రైతులకు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు నాశనం కావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కావున వెంటనే కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో నివేదిక తెప్పించుకుని న్యాయం చేయాలని కోరారు.

ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటపొలాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు నష్టం

పంటపొలాలను పరిశీలించిన రైతుసంఘం నాయకులు

అనంతపురం ఉమ్మడిలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు, అకాల వర్షానికి తీరని నష్టం జరిగింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యాప్తంగా పలు మండలాల్లో పంటపొలాలు దెబ్బతిన్నాయి. దీంతో వందల ఎకరాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ప్రజాశక్తి పుట్లూరు, తాడిమర్రి



పుట్లూరు మండలంలో నేలకొరిగిన అరటిపంట

శింగనమల నియోజకవర్గ పరిధిలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పంటపొలాలు దెబ్బతిన్నాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మండలంలోని మడుగుపల్లి, మద్దిపల్లి, జంగమరెడ్డిపేట, ఎల్లుట్ల, రంగరాజకుంట, కుమ్మనమల తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు పంటనేలకొరిగింది.పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పుట్లూరు మండలంలో 25 ఎకరాల మొక్కజొన్న, 200 ఎకరాల్లో అరటి, 50 ఎకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది.నెల రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో ఈదురు గాలుల వలన పంటలన్నీ నేలమట్టమయ్యాయని జంగారెడ్డిపేట రైతు నారాయణప్ప వాపోయారు. రెండున్నర ఎకరా పొలంలో అరటి పంట సాగు చేశానని చేతికొచ్చిన సమయానికి శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పంట నేలకొరిగిందన్నారు. పంటసాగుకు రెండున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని చేతికొచ్చే సమయానికి నేల పాలయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటనష్టాన్ని అంచనా వేయండి : శింగనమల నియోజకవర్గంలో ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేయాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనావేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలో దాదాపు 400 ఎకరాల్లో అరటిపంట ఈదురుగాలులకు దెబ్బతింది. 45 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు అంకుంట మారుతి తాడిమర్రి మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. మండలంలోని దాడి తోట, నాయన పల్లి, తురక వారి పల్లి గ్రామాలలో దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈదురు గాలులకు, అకాల వర్షానికి మూడు గ్రామాలలో 400 ఎకరాలలో అరటిపంట దెబ్బతినిందన్నారు. దాదాపు మూడు గ్రామాల పరిధిలోనూ రూ. 10 కోట్ల దాకా పంట నష్టం జరిగింటుందన్నారు. అదేవిధంగా 40 ఎకరాల మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ముదిగుబ్బ మండల పరిధిలోని ఇందుకూరు గ్రామానికి చెందిన రైతు గద్దం లోక్నాథ్ రెడ్డి సాగు చేసిన అరటితోటలో 1500 చెట్లు విరిగిపడ్డాయి దీంతో రైతుకు ఐదు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, రామిరెడ్డి, ఎస్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.ఈదురు గాలులకు నష్టపోయిన పంటపొలాలను పరిశీలించిన నష్టాన్ని అంచనావేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు, అధికారులు ఆదివారం పంటపొలాలను పరిశీలించారు. అనంతపురం జిల్లాలో శనివారం రాత్రి సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 88ఎకరాల్లో మొక్క జొన్న పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారియు.ఉమామహేశ్వరమ్మ ఆదివారం తెలిపారు.యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని నాలుగు గ్రామాల్లోని 47మంది రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వచ్చిందని వీటి నష్టం విలువ సుమారు రూ. 30.09లక్షలు ఉంటుందని అన్నారు వీటిని ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.



తాడిమర్రి మండలంలో పడిపోయిన అరటిచెట్లను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

యల్లనూరు మండలంలో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం

వివరాలు మెయిన్‌పేజీలో...

మైనార్టీ సమస్యలంటే అలుసా !

ప్రభుత్వ సలహాదారు చెప్పినా నాన్చుడే

విస్మయం వ్యక్తం చేస్తున్న మైనార్టీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉన్నతాధికారి ఒకరికి మైనార్టీల సమస్యలంటే అలుసుగా మారాయన్న విమర్శలు మైనార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. సాక్షాత్తు ప్రభుత్వ సలహాదారు చేసిన సిఫారసులనే పట్టించుకోకపోవడంతో మైనార్టీవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో తమ అసంతృప్తినిబాహాటంగానే సోషియల్ మీడియా ద్వారా వెల్లడించడం పెద్ద చర్చనీయాంశమైంది. దాని తరువాతగాని అధికారిలో చలనం కలుగకపోవడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది.

అసలు సమస్య ఏమిటి

జిల్లాలో అనేక సంవత్సరాలుగా మైనార్టీ సమస్యలు అపరిష్కృతంగా ఉంటూ వస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది అనంతపురం నగరంలో వసతి గృహ నిర్మాణం. దశబ్దకాలం కిందటే ఇది మంజూరైంది. దీనికి స్థలం కేటాయింపుపై వివాదం నడుస్తూ నిర్మాణం ప్రారంభమవలేదు. అదే విధంగా గుంతకల్లులో మైనార్టీల కోసమని ప్రత్యేకంగా నిర్మించిన ఒక భవంతి. అందులో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా నడుస్తోంది. మైనార్టీ విద్యాభివృద్ధి కోసం నిర్మించిన ఈ భవనం అసలు లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. ఇక ఎంఎస్‌డిపి (మల్టీ సెక్టోరియల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్) కింద మైనార్టీల విద్యా, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించబడి ఉన్నాయి. అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాలకు ఈ నిధులు కేటాయింపులు జరిపియున్నారు. కొన్నేళ్లు అవుతున్నా ఈ నిధుల వినియోగం జరగకుండా వృథాగానున్నాయి. ఈ నిధులను వినియోగంలోకి తీసుకురావాలని కొంత మంది జిల్లా మైనార్టీ నేతలు ప్రభుత్వ మైనార్టీ సలహాదారుగానున్న షరీఫ్‌కు ఇటీవల అనంతపురం వచ్చినప్పుడు విజ్ఞప్తి చేశారు. ఆయన తనను అధికారి కలవడానికి వస్తే అప్పుడే నేరుగా అధికారికి చెబుతానని చెప్పారు. అయితే సదరు అధికారి ప్రభుత్వ సలహాదారుని మర్యాదపూర్వకంగా కలవడానికి కూడా రాకపోవడంతో సంతకాలు చేసి సిఫారసు లేఖ ఇచ్చారు. అది స్థానిక నేతలు అధికారికి అందజేశారు. కొద్ది రోజుల తరువాత సలహాదారు షరీఫ్ తాను చేసిన సిఫారసులో ఏదైనా కదలిక వచ్చిందా అని స్థానిక నేతలను ఆరా తీశారు. లేదని చెప్పడంతో నేరుగా ఫోన్ చేసి అధికారికి సమస్యలను పరిశీలించమని సూచించారు. అయినా ఫలితం లేకపోవడంతో మరోమారు సూచించారు. అయినా ఫలితం లేదు. దీంతో అసంతృప్తి చెందిన మైనార్టీ నేతలు ఈ విషయాన్ని సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. మైనార్టీ సమస్యలంటే అధికారికి అంతటి అలుసా అంటూ విమర్శించారు. దీంతో ప్రభుత్వం దీనిపై ఆరా తీసింది. అంతటితోనే హడావుడి పడిన అధికారి సలహాదారు షరీఫ్‌కు నేరుగా ఫోన్ చేసి సమస్యలు చెబితే ఇప్పుడు పరిష్కరిస్తానని చెప్పినట్టు సమాచారం. స్థానిక నాయకులు వెళ్లి మరోమారు ఆయనకు సమస్యలను విన్నవించారు. అప్పుడుగాని ఆయనలో కదలిక రాలేదు. అయితే ఈ సమస్యలు ఇప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో కొలిక్కిరాలేదని మైనార్టీ నాయకులు వాపోతున్నారు.



పిడిఎస్‌లో చిరుధాన్యాలివ్వాలి

సాగును ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

'మిల్లెట్ మ్యాన్' ఖాదర్ వలి

రెండో రోజు మిల్లెట్‌మేళాకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న మిల్లెట్ మ్యాన్ ఖాదర్‌వలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను ప్రజలకు అందివ్వాలని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పిలుచుకునే డాక్టర్ ఖాదర్ వలి కోరారు. అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో పోలీసు కన్వెన్షన్ హాలులో మిల్లెట్ మేళా రెండు రోజులుగా నడుస్తోంది. ఈ మిల్లెట్ మేళాకు ఆదివారం విశేష స్పందన లభించింది. వందల సంఖ్యలో ప్రజలు ఈ మేళాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఖాదర్‌బాషా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మిల్లెట్ వాడకం పెంచే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరముందని సూచించారు. ఎరువులు సబ్సిడీకి ఇస్తున్న దానిలో పావు వంతు చిరుధాన్యాలకు సాగుకు కేటాయించినా ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. చిరుధాన్యలపై జిఎస్‌టిని మినహాయించాలని కోరారు. పిడిఎస్‌లో చిరుధాన్యాలకు ప్రజలకు అందివ్వాలని కోరారు. దీర్ఘకాలిక జబ్బులకు కూడా మన తిండే ప్రధాన కారణమని చెప్పారు. ఆహారంలో మార్పులు చేసుకుంటే జబ్బులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వీటి పట్ల ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించేందుకు 18 సంస్థలు కలసి ముందుకొచ్చి మేళా నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అడిగిని అనేక సందేహాలకు ఆయన సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చిరుధాన్యాల ప్రోత్సహకానికి అందిస్తున్న సహకారాన్ని, తోడ్పాటు గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా వీటి వాడకం చేకూరే ప్రయోజనాల గురించి తెలియజేశారు. నాబార్డు జిల్లా మేనేజరు అనురాధా వ్యవసాయ ఉత్పత్తిదారులకు వారి ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక కార్యదర్శి త్రిలోచన్ శాస్త్రి అనంతపురం జిల్లాలో అన్ని ఎఫ్‌పిఓలు ఐక్యమై తయారు చేయబడిన విలువ ఆధారిత ఉత్పత్తులకు ఒక బ్రాండ్‌ను సృష్టించాలని సూచించారు. అందుకు తన మద్దతును అందిస్తామని హామీనిచ్చారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌తోపాటు రాయలసీమ జిల్లాలో పక్షుల వలన పంటలకు ఏ రకంగా మేలు జరుగుతుందన్న ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. అదే సందర్భంలో వివిధ రకాల గ్రామీణ కళా ప్రదర్శనలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టరు వైవి.మల్లారెడ్డితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ, సమానత్వం సాధనకు పోరాట స్ఫూర్తి భగత్ సింగ్

భగత్‌సింగ్ వర్ధంతి సభలో వక్తలు



ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాల్లాదుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం సాధించేందుకు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ గొప్ప పోరాట స్ఫూర్తిగా నిలిచారని ఆయన ఆశయాలను కొనసాగించడమే ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం, మహిళా, కార్మిక, యువజన, విద్యార్థి, శ్రామిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఐద్వా ఆధ్వర్యంలో ఇందిరా నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్‌ను కేవలం ఓ స్వాతంత్ర సమరయోధుడుగా, బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన సాహసిగా మాత్రమే చూస్తే అది అసమగ్రమేనని అన్నారు. నీతికి మూలం మనిషే కావాలి తప్ప మతం కాకూడదని నినదించాలన్నారు. భగత్ సింగ్ ఇందుకు అవసరమైన చూపునిస్తాడు, పోరాడే బలం ఇస్తాడు, విధ్వంసమైన బతుకుల్ని విప్లవ కార్యాచరణకు నడిపించడం ఎలాగో వివరిస్తాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, శాఖ కార్యదర్శి ఫర్యాది, అశ్విని, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ... స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖదేవ్ 94 వర్ధంతి కార్యక్రమం సిపిఎం ఆధ్వర్యంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వీరభద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రాజమోహన్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచిన యువ కెరటం భగత్ సింగ్ అన్నారు. భగత్‌సింగ్ పేరు వింటే చాలు భారతీయుల నరాల్లో నెత్తురు ఉడుకుతుందని, గర్వంతో ఉప్పొంగుతుందని, ఆయన ఆలోచనలు, ఆశయాలు ఆవేశం ఎంతో మంది యువతకు స్ఫూర్తిదాయకమనిఅన్నారు. ఆయన మరణించి ఇప్పటికి 94 సంవత్సరాలు అవుతున్న భారత ప్రజల గుండెల్లో వారి స్థానం చెక్కు చెదరలేదని తెలిపారు. అదే విధంగా మల్లు స్వరాజ్యం కాలనీ, ప్రజాశక్తి కాలనీ, శ్రీశ్రీ నగర్, మహదేవ్ నగర్, సీతారాం ఏచూరి నగర్, శాంతి నగర్, ఇందిరా నగర్, నీలిమ టాకీస్, తపోవనం, రుద్రంపేట, మున్సిపాలిటీ ఆరు సర్కిలలో, అంబేద్కర్ నగర్, హమాలి ఆఫీసు, భగత్ సింగ్ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో టవర్ క్లాక్ దగ్గర, రెండవ రోడ్డు స్టడీ సర్కిల్ పార్కులో, రెండవ రోడ్డు లోని టెంపో ట్రావెలర్ తుఫాన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ముత్తుజా, వెంకటనారాయణ, రామాంజినేయులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, వలీ, ఇర్ఫాన్, గోపాల్, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ సీన, బుల్లె రాజు, గఫూర్, వెంకటేష్, జీవ లక్ష్మీనారాయణ, ఎర్రి స్వామి, లక్ష్మీనరసమ్మ, ఏటీఎం నాగరాజు, లతీఫ్, ప్రసాద్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నూరుల్లా, నగర నాయకులు చాంద్, రామంజీ, ఇస్మాయిల్, నరేష్ శేఖర్, ఆదిరెడ్డి, నాగరాజు, అజాం, ఆది, రామలింగారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, బండారి ఎర్రిస్వామి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, ఆటో యూనియన్ కోశాధికారి రామలింగారెడ్డి, శ్రీనివాస్ మూర్తి, బంగ్లా రాఘవ, పెన్నోబులేసు, ప్రభాకర్, రామంజి, ఉన్నూరు, సీనా, చంటి, వెంకటేష్ పాల్గొన్నారు. గణేనాయక్ కాలనీలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి ఉప సర్పంచ్ మసూద్, సిపిఎం నాయకులు వలి, డేవిడ్, వెంకటనారాయణ, పొన్నూరు, లక్ష్మీదేవి, బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సాధికార కమిషన్ వేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వెనుకబడిన ప్రాంతం, కరవుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సాధికార కమిషన్‌ను వేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు.' సాగునీటి ప్రాజెక్టులు, విభజన హామీలు అమలు' అనే అంశంపై ఆదివారం అనంతపురం ఆజాద్‌నగర్‌లోని బిజిఆర్ ఫంక్షన్ హాల్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. ముఖ్యంగా హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని, 10వ వేల క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేయాలని కోరారు. సైన్స్‌సిటీ కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. బంగారు, వజ్రాలు, ఇసుక, గాలి, ఎండ, రాళ్లను ఎక్కడికక్కడ గ్రామాలను యూనిట్‌గా తీసుకుని సంబంధిత గ్రామాల కుటుంబాలను భాగస్వాములను చేయడం ద్వారా ప్రజలకు ఆదాయం, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. తర్వాత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంటల నారాయణరెడ్డి, కార్యదర్శి హిందూపురం శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణ, ఉపాధ్యక్షులు కెవి.రమణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వై.మధుసూధన్‌రెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ తరహాలో డిజిటల్ క్రాప్ నమోదు

జిల్లా వ్యవసాయశాఖాధికారి వైవి. సుబ్బారావు





జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవి. సుబ్బారావు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇదివరకు ఏ విధంగా ఈ క్రాప్ నమోదు విధానం అమలు చేస్తున్నామో అదే తరహాలో కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు డిజిటలైజేషన్ చేసి ఈ క్రాప్ నమోదు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు తెలిపారు. ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : డిజిటల్ క్రాప్ నమోదు చేయడానికి తీసుకుంటున్న చర్యలేవీ?

జవాబు : ఈ క్రాప్ నమోదు విధానం ఏ విధంగా అమలు చేస్తున్నాము అదే తరహాలో కేంద్ర ప్రభుత్వం సూచనలు మేరకు డిజిటలైజేషన్ చేసి ప్రస్తుతం పొలంలో ఉన్న రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఆధార్ తరహాలో ఇవ్వడం జరుగుతుంది. భవిష్యత్తులో రైతులకు సంబంధించిన ప్రతి పథకాన్ని అమలు చేసేందుకు అధికారికంగా విశిష్ట గుర్తింపు కార్డుని ప్రాతిపదికన తీసుకుంటారు. త్వరలో అందరి రైతులకు కూడా విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు జరిగే అవకాశం ఉంది. మన రాష్ట్రంలో కూడా దీనిని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే సత్యసాయి జిల్లాలో చేపట్టాం. ఇప్పటివరకు 80 శాతం మంది రైతులకు విశిష్ట సంఖ్య కేటాయింపు జరిగింది.

ప్ర : రైతు సేవా కేంద్రాల ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జ: గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు. ని ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు మున్ముందు కౌలు రైతులకు, భూములు లేని వ్యవసాయ కూలీలు ఇతర వ్యవసాయ ఆధారితవృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుంది. దీని నమోదు చేయడానికి ఆధార్ కార్డు ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్, భూమి రికార్డు వివరాలు తీసుకొని రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని కలిసి విశిష్ట సంఖ్య పొందవచ్చు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకానికి ఉపయోగపడే విధంగా రైతులు సహకరించాలి. రైతులకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఈ విశిష్ట సంఖ్యతోనే ముడిపడి ఉంటుందని విషయం గుర్తించుకోవాలి.

ప్ర : భూ ఆధారిత పథకాల ద్వారా రైతులకు ఎలాంటి లాభాలు ఉన్నాయి ?


జ : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 32 మండలాల్లో ఉన్న రైతులు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పెట్టుబడి సాయం, పంట రుణాలు, తదితర పథకాలు నేరుగా పొందే అవకాశం ఉంటుంది. వర్షాభావ పరిస్థితులు వరదలు, తుఫాన్ వంటి సందర్భాల్లో రైతులకు పంటలు నష్టపోయిన సందర్భాల్లో రైతులకు నష్టపరిహారం అందిందుస్తున్నారు. నీటిపారుదల, తెగులు నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం సహాయం అందిస్తుంది.

ప్ర : రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ మీ అభిప్రాయం?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాలలో రైతులకు ప్రతి ఖరీఫ్ ,రబీ సీజన్లో వేరుశనగ విత్తన కాయలను సబ్సిడీ ధరపై అందజేస్తున్నాం. అదే తరహాలోఈ ఏడు కూడా అందించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నాణ్యమైన విత్తన వేరుశనగ అందించడానికి అన్ని చర్యలు తీసుకున్నాం. గతంలో కూడా అంతర్ పంటలు వేయడానికి రైతులకు జొన్నలు, ఉలవలు, అలసందలు ఉచితంగా అందించాం. ప్రతి రబీ, ఖరీఫ్ సీజన్లో ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా విత్తన గింజలను సకాలంలో అందజేస్తున్నాం.

భగత్‌సింగ్‌కు ఆశయాలను కొనసాగిద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప


పామిడిలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అతిచిన్న వయస్సులోనే దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిని భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ అసమానతలు లేనిసమానమైన అభివృద్ధి కావాలని, మతసామరస్యం వర్ధిల్లాలని కోరుతూ భగత్‌సింగ్ ఉరికంబాన్ని ముద్దాడడని కొనియాడారు. మహాత్మాగాంధీ పిలుపుతో 13ఏళ్ల వయస్సులో తాను చదువుతున్న 9వ తరగతికి స్వస్తి చెప్పి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడన్నారు. అది భగత్‌పై విపరీత ప్రభావం చూపిందన్నారు. చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలను ఎదిరించారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేసి 23 ఏళ్ల అతిపిన్న వయసులోనే ఉరికొయ్యను ముద్దాడాడన్నారు. 1931 మార్చి 23న రాత్రి 7.30 గంటలకు భగత్‌సింగ్‌తోపాటు సుఖ్‌దేవ్, రాజ్‌గురులను హుస్సైన్‌వాలా జైల్లో బ్రిటీష్ పాలకులు ఉరితీశారు. అలాంటి వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, సీనియర్ నాయకులు వి.శివారెడ్డి, మండల కమిటీ సభ్యులు పుల్లయ్య, నాగరాజు, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, వెంకట్‌కొండ, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. శ్రీనివాసులు, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే భారత దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని యువతకు ఆదర్శంగా నిలిచిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. సామ్రాజ్యవాద సంకెళ్ల నుంచి భరతమాతను కాపాడాలని తన ప్రాణాలు సైతం లెక్కజేయకుండా ప్రాణాలను ఫణంగా పెట్టిన ధీరశాలి అని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు శివకుమార్, బాబు, షాషు, ఈశ్వరయ్య, చంద్రమోహన్‌రెడ్డి, వెంకట్రాముడు, చంద్రకళ, ధను, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలోని తరిమెల, నిదనవాడ, ఆనందరావుపేట, రాచేపల్లి, సలకంచెరువు గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, మేకల పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఓబిరెడ్డి., లక్ష్మీనారాయణరెడ్డి, బాషా, రామాంజనేయులు, కుళ్లాయిస్వామి, రమేష్, రామాంజనేయులు, చెంగల్, సుంకన్న, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌సింగ్ థాపర్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య, సంజీవకుమార్, బిఎ హుస్సేన్, వై.ప్రసాద్, మహబూబ్‌పీరా, పెంచలయ్య, శివశంకర్, నబిరసూల్, నాగరాజు, బాలాస్వామి, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు, మండల కార్యదర్శి అరుణ్ రషీద్, నాయకులు ఆసిఫ్,సాయి,కిరణ్, సిపిఎం నాయకులు మురళి, వీరాంజినేయులు, రవి, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం మండల కార్యదర్శి విరుపాక్షి ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎంపి మల్లికార్జున, హమాలీ నాయకులు చంద్రశేఖర్, మండల కమిటీ సభ్యులు చాబాల సుధాకర్, పెద్దన్న, ఐకెపి సుధాకర్, హమాలీ సుధాకర్, తలారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విప్లవ వీరులు, ఆదర్శప్రాయులు, స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతిని జన విజ్ఞాన వేదిక, భగత్ సింగ్ కమిటీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, నాయకులు ఎ. రామాంజనేయులు, డాక్టర్ సి. వెంకటేశ్వర్లు రెడ్డి, శ్రీధర్ గౌడ్, భగత్ సింగ్ కమిటీ నాయకుడు బి.నిజామొద్దీన్, వైసీపీ నాయకుడు ఎం. రంగస్వామి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, నాయకులు నవీన్ యాదవ్, విజయ్ నాయక్, బాలు, ధను, డివైఎఫ్ఐ నాయకుడు అశోక్, సిపిఐ నాయకులు జి. రామదాసు, షేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుంతకల్లు : స్థానిక సిఐటియు కాలనీలో సిపిఎం, ఐద్వా, ఆవాజ్ సంఘాల నాయకులు, శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో డివైఎఫ్ఐ నాయకులు, ఆర్టీసీ బస్టాండు కూడలిలోనీ భగత్ సింగ్ విగ్రహం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వేర్వేరుగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, సిసిఇ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శేషకుమార్, లెక్చరర్ పక్కీరప్ప, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యోక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, పట్టణ అధ్యక్షుడు నవదీప్, విజయ్, దర్శన్, ఏకాంత, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రభుత్వ ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి పవన్‌కుమార్, పట్టణ కార్యదర్శి, హర్షవర్ధన్, గర్ల్స్ కన్వీనర్ మౌలిక, ఉపాధ్యక్షులు సాయి, బాలు, సహాయ కార్యదర్శి స్రవంతి, మౌనిక, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని బిసి బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, నాయకులు వంశీ గౌతమ్, వలీ, అరవింద్, మహబూబ్‌బాషా, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని శ్రీనివాస విద్యానికేతన్ స్కూల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సాగర్, కిరణ్, చిరంజీవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని అమ్మలదిన్నెలో ఎపి వ్యవసాయ సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, పూసల సంఘం నాయకులు చంటి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు శంకర్, శ్రీనివాసులు, కుమార్, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

బ్రహ్మసముద్రం : రైతులు అందరూ తప్పనసరిగా యూనిక్ ఐడి కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి సరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,410 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన 9,297 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వీరందరూ వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి

రాయదుర్గం : ప్రజారోగ్యంపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల ప్రాణాలను కాపాడాలని బీసీవై పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు గౌని ప్రతాపరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు నెలల్లో ఆర్ఎంపిల చేతుల్లో ముగ్గురు ప్రాణాలను కోల్పోయినప్పటికీ జిల్లా వైద్యాధికారుల్లో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. ఎవరైనా చనిపోయినప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి, క్లినిక్ సీజ్ చేశామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వయోజనులకు 'ఉల్లాస్' పరీక్షలు

బ్రహ్మసముద్రం : మండలంలోని మహిళా వయోజనులు, వికలాంగులకు ఆదివారం ఉల్లాస్ నవభారత్ సాక్షరతా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య పర్యవేక్షకులు రవి మాట్లాడుతూ మండలంలో నిరక్షరాశులను 1,867 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరికి 57 అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ విభాగం సూపర్‌వైజర్ రవి, ఎపిఎం హుస్సేన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రామాంజనమ్మ, ఖాసీంబీ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నార్పల : అనంత ఆదర్శ అభ్యుదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక శ్రీ సత్యసాయి అనాథాశ్రయంలో అన్నదానం చేశారు. ముందుగా కేక్ కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ దండువారిపల్లి సాకే రాజు, వైస్ ప్రెసిడెంట్ శిరివరం నాగరాజు, సెక్రటరీ పుల్లన్న, నార్పల సుధాకర్, మహేష్, శ్రీనివాసులు, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని కెజిబివిలో 6 నుంచి 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఒ మహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌కు విద్యార్థిని ఎంపిక

బ్రహ్మసముద్రం కెజిబివి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యామిని సింధు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌కు ఎంపికైనట్లు ఎస్ఒ మహాలక్ష్మి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన సైన్స్‌ఫెయిర్‌లో పోటీపడి విజయం సాధించి అగస్తే ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈమె ఈనెల 25న చిత్తూరు జిల్లాలో కుప్పంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఘనంగా రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యల్లనూరు : మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వెంకటరమణ స్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా సాగతింది. భక్తులు భారీగా తరలిరావడంతో గోవింద నామస్మరణతో యల్లనూరు మారుమాగింది. రథం ముందు చెక్కభజన ఏర్పాటు చేశారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా ఎస్ఐ రామాంజనేయరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఉరవకొండ : పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ ప్రాంగణంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా దాదాపు 200 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 85 మందికి అద్దాలు అవసరం కాగా 22 మందికి శస్త్ర చికిత్సలు అవసరమైనట్లు వైద్యులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, మధుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర శివారుల్లో ఉన్న శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా హిమజ బృందం భరతనాట్యం ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో సంధ్యామూర్తి, పరిపాలన అధికారి శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

శింగనమల : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోద ముద్ర వేయాలన్ని హర్షిస్తూ 30ఏళ్లుగా పోరాడుతున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మండల కేంద్రంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్ర, ఎంఇఎఫ్ తాలూకా అధ్యక్షుడు కరెంటు నల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఎం.మురళి, కోశాధికారి రాము, నాయకులు ఓబులేసు, పీజీ నల్లప్ప, సురేష్, సాయి, ఆదేశ్, అనిల్, ఫణీంద్ర, ప్రభు, దయాకర్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

అనంతపురం : రంజాన్ పండుగను పురస్కరించుకుని నగరంలోని పాతూరు గుత్తి రోడ్డు వద్ద ఆల్ అమీన్ ఛారిటబుల్ ట్రస్టు, రషీద్ అహ్మద్ మెమోరియల్ ట్రస్టు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. తొలుత ఖురాన్ పఠనం తో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ముర్షిదా బేగం, అర్షద్, ఆదాం, బాబా, హఫీజ్, ఇమ్రాన్, జబ్బార్, ఇలియాస్ ట్రస్టు సభ్యులు అంజుమ్, ఖలీమ్, తదితరులు పాల్గొన్నారు.

నీలూరు రోడ్డుకు మరమ్మతులు

పామిడి : మండలంలోని నీలూరు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. భారీ వర్షాలకు నీలూరు రోడ్డు దెబ్బతింది. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఈశ్వర్ రోడ్డుకు మట్టి తోలి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రామాంజనేయులు, స్టోర్ డీలర్ రంజిత్‌కుమార్, టిడిపి యువ నాయకులు రాజ కుల్లాయప్ప, గంగవర్ధన, జెసిబి శేఖర్‌యాదవ్, ప్రసాద్, గణేష్‌యాదవ్, అబ్దుల్‌బాషా, సురేంద్ర, సుందరరాజు పాల్గొన్నారు.

గ్రానైట్స్, టైల్స్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని బళ్లారి రోడ్డులో మయూరి టైల్స్ అధినేత రంగనాయకులు సౌజన్యంతో గ్రానైట్, టైల్స్ లేయింగ్ వర్కర్స్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. అసోసియేషన్ (సిఐటియు) అధ్యక్షులుగా ఎర్రిస్వామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా దాన ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా వీరయ్య, జాయింట్ సెక్రటరీగా రజాక్, ట్రెజరర్‌గా మజీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జమీల్ అహ్మద్‌ను ఎన్నుకున్నట్లు సిఐటియు నాయకులు వెంకట్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికుల ఐక్యత కోసం సంఘాల ప్రాతినిథ్యం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ శ్రమకు తగ్గ ఫలితంగా హక్కుల సాధనకు కృషి చేయాలని తెలిపారు. మయూరి టైల్స్ అధినేత రంగనాయకులు మాట్లాడుతూ కార్మికులు ఐక్యతగా ఉండాలన్నారు. వారి సంక్షేమం కోసం కార్మికులు స్వీయ బాధితులకు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సుజాత, రమాదేవి కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామాంజి, ముత్తుజా, జిలాన్, కార్మిక శాఖ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం : యుటిఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వం, సమాజంపై ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య అన్నారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 117 జిఓ రద్దు చేసి మరో జీవో తేవడం కోసం చేస్తున్న కసరత్తులో ప్రభుత్వం విద్యారంగం సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. ఈ విద్యారంగ సంస్కరణల వల్ల 1,2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20వేలకుపైగా పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలు మూసివేతకు గురవుతాయని హెచ్చరించారు. ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను రద్దు చేసే దిశగా విద్యారంగ సంస్కరణలు ఉన్నాయని దీని వల్ల బాలికలు విద్యకు దూరమవుతారని తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను మ్యాప్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదన్నారు. మోడల్ పాఠశాలలంటే 5 గదులు ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే కాదని అన్ని హంగులతో పాఠశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలను తగ్గించడం కాకుండా పిల్లల అభివృద్ధి కోణంలో సంస్కరణలు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి పాటుపడదాం

రంజాన్ తోఫా పంపిణీలో ఎంపి అంబికా


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

మత సామరస్యం, సామాజిక సమగ్రతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని లలిత కళా పరిషత్‌లో విశ్రాంత ఎస్పీ షేక్షావలి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి మాట్లాడుతూ రంజాన్ పవిత్రతను మనస్సులో నిలుపుకుని సమాజ నిర్మాణంలో స్ఫూర్తిదాయక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పేదలకు సాయం చేయడం, రంజాన్ తోఫా అందించడంలో భాగస్వామి కావడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. మైనారిటీలకు సేవ చేస్తున్న షేక్షావలిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, ఐఎంఎం బాషా, మైనారిటీ సంఘం ప్రతినిధులు, ముస్లిములు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని అరికడదాం

డాక్టర్ రంగు సుధీంద్ర-నేడు అంతర్జాతీయ టిబి దినోత్సవం



ప్రజాశక్తి-అనంతపురం

దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న క్షయ వ్యాధిని అరికట్టేందుకు కలిసి నడుం బిద్దామని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆసుపత్రి అధినేత డాక్టర్ రంగు సుధీంద్ర పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ టీబీ దినోత్సవాని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి (టిబి) ఊపిరితిత్తులను ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి అన్నారు. క్షయవ్యాధితో ఉన్న వ్యక్తి దగ్గినా, తుమ్మినా గాలిమార్గం ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. భారత్‌లో టిబి కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో ఇది ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. టిబి ఒక బాక్టీరియా వల్ల కలిగే వ్యాధి అని గాలిమార్గం ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇది చేతుల ద్వారా, భోజనం పంచుకోవడం ద్వారా వ్యాపించదన్నారు. రెండు వారాల కంటే ఎక్కువకాలం కొనసాగే దగ్గు, జ్వరం, రాత్రి పూట ఎక్కువగా చెమటలు, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, నలత, అలసట వంటి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. టిబి పూర్తిగా అంతం చేయాలంటే అందరూ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాకుండా టిబిని పూర్తిగా నిర్మూలించాలంటే ఆసుపత్రులు, మందులు, అవగాహన కార్యక్రమాలకు మరింత పెట్టుబడి అవసరన్నారు. ముఖ్యంగా పేద, గ్రామీణ ప్రాంతాల్లో చికిత్స అందుబాటులోకి రావాలన్నారు.

గ్రామీణ వైద్య వృత్తిని పరిరక్షించాలి


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న ఎపిఎంపిఎ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి


ప్రభుత్వం గ్రామీణ వైద్య వృత్తిని ప్రభుత్వం పరిరక్షించాలని ఉమ్మడి అనంతపురం జిల్లాల ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎపిఎంపిఎ) తాలూకా అధ్యక్షులు వి.నాగేంద్ర కోరారు. ఆదివారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను కలిసి ఎపిఎంపిఎ 30వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో అనంతపురం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎపిఎంపిఎ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలో మహాసభను నిర్వహిస్తామన్నారు. గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణ గురించి తెలిపేందుకు ఆ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఐక్యతను రాష్ట్రవ్యాప్తంగా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు షేక్షావలి, బిశ్వాస్, శేఖర్, వెంకటరాముడు, కుళ్లాయప్ప, రవి,తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : పట్టణంలోని రాణి సత్రం ప్రయివేటు బస్టాండ్ వద్ద ఆదివారం సూర్య సేవా సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇలాంటి చలివేంద్రాలు పట్టణంలో మరికొన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తొలిరోజు తాయి కృష్ణమూర్తి, లక్ష్మీదేవి జ్ఞాపకార్థం వారి కుమారులు మంజునాథ, రాజశేఖర్, అనిల్‌కుమార్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య సేవా సమితి అధ్యక్షులు పసుపులేటి వెంకటేశులు, ఉపాధ్యక్షులు ఉబేదుల్లా, కార్యదర్శి బీస శ్రీనివాస్, షబ్బీర్, హరికృష్ణ, మల్లికార్జున, మురళి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు పరిటాల సునీత పరామర్శ


మంత్రితో మాట్లాడుతున్న సునీత

అనంతపురం రూరల్ : ఎపి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో పరామర్శించారు. మంత్రి సతీమణి షహనాజ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సునీత, శ్రీరామ్ మంత్రిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

షటిల్ టోర్నమెంట్

ఉరవకొండ : ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ షటిల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో లయన్స్ క్లబ్ షటిల్ ప్లేయర్లు టి.గణేష్‌బాబు, బాలచంద్ర, సప్తగిరి మల్లికార్జున, సురేంద్ర, సంజీవరెడ్డి, నరేష్‌తోపాటు 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 15 టీములుగా ఏర్పడి 23, 24వ తేదీల్లో రెండు రోజులపాటు టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ స్పాన్సర్లుగా టి.గణేష్‌బాబు, సప్తగిరి మల్లికార్జున, టీచర్ చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారు. విజేతలకు ఉగాది పండుగ రోజు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఉరవకొండ : దళిత గిరిజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీటీ కార్యాలయ ప్రాంగణంలో శాంతిరామ్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా టీం లీడర్ సురేష్‌బాబు పర్యవేక్షణలో డాక్టర్ సైపుల్లా, డాక్టర్ రాఘవేంద్ర, ఇఎన్‌టి కె.బండయ్య, కె భాస్కర్, అప్తామాలజిస్ట్ కలిసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, వజ్రకరూరు కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, డిజిహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకులు గోపాల్, రాష్ట్ర అధ్యక్షులు సాకే బి.రమేష్, లతవరం చంద్రశేఖర్, ఓంకార్, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు బెంజిమెన్, పాల్తూరు ఆనందరాజు, ఎర్రిస్వామి, నాగరాజు, బసవరాజు, లక్ష్మన్న, సి.చిరంజీవి, గణేష్, చెన్నప్ప, సురేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో నివాసం ఉంటున్న శివ మురుగేషన్ (40) పని నిమిత్తం తాడిపత్రికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో తాడిపత్రి – బుగ్గ ప్రధాన రహదారిపై వెంకట్‌రెడ్డిపల్లి వద్ద ఎదురుగా బండల లోడ్ వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో శివ మురిగేషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

కణేకల్లు : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. రచ్చుమర్రి రీచ్ నుంచి టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంబంధిత రీచ్ వారం క్రితమే బంద్ అయినప్పటికీ టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు తెలిపారు. ఇంతకు మునుపు రీచ్ తీసుకున్నవారే ఇసుక తరలిస్తున్నారా.. మరెవరైనా తరలిస్తున్నారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న టిప్పర్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.